సాక్షి చిత్తూరు

గురువారం । 16 । మే । 2024



ఖరీఫ్‌కు సన్నద్ధం

ఖరీఫ్‌కు రైతులు కోటి ఆశలతో సన్నద్ధమవుతున్నారు. వాతావరణం అనుకూలించడంతో సాగుకు పూనుకుంటున్నారు. - 10లో



మరమ్మతులు

బోయకొండ గంగమ్మ ఆలయ కార్యాలయంలో మరమ్మతులు చేయిస్తానని ఆలయ ఈఓ చంద్రమౌళి తెలిపారు. - 10లో



వేషాల వేడుక

తాతయ్యగుంట గంగమ్మ జాతర తొలి రోజు బుధవారం భక్తుల బైరాగి వేషాలతో హోరెత్తింది. - 10లో

న్యూస్‌రీల్

కౌంటింగ్ కేంద్రానికి అన్ని ఈవీఎంలు

- నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు భద్రత



సీల్ వేసిన స్ట్రాంగ్ రూం వద్ద గస్తీ కాస్తున్న కేంద్ర బలగాల పోలీసు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల ఈవీఎంలు జిల్లా కేంద్రానికి సరిహద్దులో ఉన్న ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్నాయి. 13వ తేదీ నుంచి విడతల వారీగా వచ్చిన ఈవీఎంలను పకడ్బందీగా పరిశీలించి వాటిని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. కుప్పం నియోజకవర్గానికి సంబంధించి మొదట అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక గోడౌన్‌లో ఈవీఎంలను భద్రపరిచారు. అనంతరం వాటిని కౌంటింగ్ కేంద్రానికి గట్టి బందోబస్తు నడుమ వాటిని తరలించారు. అబ్జర్వర్‌లు, ఏజెంట్ల సమక్షంలో అన్ని నియోజకవర్గాల ఈవీఎంలను భద్రపరిచారు. ప్రతి స్ట్రాంగ్ రూం వద్ద సీసీ కెమెరాలను, కేంద్ర బలగాలను విధుల్లో పెట్టారు. ఐడీ కార్డు ఉన్న వారు మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తున్నారు. బయటి వ్యక్తులు లోనికి ప్రవేశించకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది.

భక్తులతో కాణిపాకం కిటకిట



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు, ఎన్నికలు ముగియడంతో ఆలయానికి భక్తుల తాకిడి మరింత పెరిగింది. ఆలయ క్యూలో భక్తులు బారులు తీరారు. అధికారులు భక్తులు అసౌకర్యానికి గురికాకుండా పర్యవేక్షించారు. స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు.

జిల్లాకు చేరిన పోస్టల్ బ్యాలెట్లు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న చిత్తూరు జిల్లాకు చెందిన ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు బుధవారం జిల్లాకు చేరాయి. జిల్లాకు చెందిన ఉద్యోగులు వివిధ జిల్లాల్లో విధులు నిర్వహిస్తుంటారు. వారందరూ ఎన్నికల సంఘం కల్పించిన పోస్టల్ బ్యాలెట్‌ను ఆయా ఫెసిలిటేషన్ సెంటర్లలో సద్వినియోగం చేసుకున్నారు. ఆ పోస్టల్ బ్యాలెట్లను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని రిటర్నింగ్ అధికారులు చిత్తూరు జిల్లాకు పంపారు. ఆ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను పకడ్బందీ బందోబస్తు నడుమ కలెక్టరేట్‌లో నియోజకవర్గాల వారీగా వేరుచేసే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తర్వాత ఏడు నియోజకవర్గాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్లను ప్రత్యేక బాక్సులలో భద్రపరిచారు. ఈ కసరత్తు మొత్తం నిఘా నీడలో నిర్వహించారు. అనంతరం ఆ బాక్సులకు సీల్ వేసి ఎస్వీ సెట్‌లోని కౌంటింగ్ సెంటర్‌కు తరలించి ప్రత్యేక స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఈ కసరత్తును జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ పర్యవేక్షించారు.



పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

మహిళలే గెలుపు నిర్దేశకులు

కుప్పం అసెంబ్లీ నియోజకవర్గంలో ఈసారి గెలుపెవరిదోననే చర్చ సర్వత్రా మొదలైంది. ప్రధానంగా ఓటింగ్‌కు మహిళలు పోటెత్తడం ..పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్న నేపథ్యంలో మహిళలే అభ్యర్థుల గెలుపు శాసించనున్నట్టు తేలడంతో మరింత ఉత్కంఠ కలిగిస్తోంది. అయితే బరిలో ఉన్న ప్రధాన అధికార పక్షం, ప్రతిపక్షం తమ తమ అంచనాలతో గెలుపుపై ఆశలతో ఉంటున్నాయి. ఎవరికి వారు తమదే గెలుపు అనే ధీమాలో ఉంటున్నాయి.

- ఎన్నికల్లో పెరిగిన ఓటింగ్ శాతం
- పురుషుల కంటే మహిళల ఓట్లే పోలింగ్‌లో అధికం
- మహిళల చేతుల్లో అభ్యర్థుల గెలుపు
- ఎవరి అంచనాలు ఫలిస్తాయో?

కుప్పం: ఈ సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే అధికార పార్టీ వైఎస్సార్ సీపీకి కుప్పం నియోజకవర్గంలో ఆదరణ పెరిగింది. 90 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో మహిళా ఓటర్లే అధికం కావడంతో ఇప్పుడు ఫలితాలపై ఆసక్తి రేపింది. ఎక్కడ చూసినా కుప్పంలో గెలుపెవరిదోనంటూ చర్చకు తావిస్తోంది. వైఎస్సార్‌సీపీ విజయానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రచార శైలి, ప్రజా స్పందన, పోలింగ్ రోజున మహిళలు పెద్ద ఎత్తున తరలిరావడం వంటివి తమకు సానుకూల పరిణామాలని ఆ పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి.

బాబు కోటకు బీటలు

1989లో తొలిసారి కుప్పం నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా చంద్రబాబు అడుగుపెట్టారు. అప్పటి నుంచి 2019 వరకు వరుస విజయాలతో కొనసాగుతున్నారు. దీంతో పాటు 1996 నుంచి 2004 వరకు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు. అప్పటి నుంచి కుప్పం ఎమ్మెల్యేగా చంద్రబాబును గెలిపిస్తే ముఖ్యమంత్రి అవుతారని, ఇతరులను గెలిపిస్తే సాధారణ ఎమ్మెల్యేగానే ఉంటారని ప్రజల్లో ఒక అభిప్రాయం నాటుకుంది. 2014 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తుండడంతో ఆయనపై ప్రజల్లో ఆదరణ తగ్గిపోసాగింది. అలాగే చంద్రబాబుకు కుప్పంలో వ్యతిరేకత మొదలైంది. 2004 నుంచి వరుసగా జరిగిన ఎన్నికల్లో మెజార్టీ తగ్గుముఖం పట్టడం దీనికి నిదర్శనంగా ఉంటోంది. 2004లో 58,588 మెజార్టీ, 2009లో 46,066, 2014లో 47,114 అనంతరం 2019లో 30,674 మెజార్టీ సాధించారు. 2014లో అధికారం ఉన్నప్పుడు టీడీపీ పాలనలో స్థానిక నాయకులు ఆగడాలు, దౌర్జన్యాలు, అవకతవకలకు కుప్పం ప్రజలు విసిగి వేసారిపోయారు. దీంతో వైఎస్సార్ సీపీ వైపు యువత మొగ్గుచూపింది. దీంతో 2019 ఎన్నికల్లో చంద్రబాబు 30 వేలకు మెజార్టీ పడిపోయింది. అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ కుప్పం నియోజకవర్గంలో బలపడింది. వైఎస్సార్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా భరత్ రంగ ప్రవేశం చేశాక నియోజకవర్గంలో పట్టు సాధించారు. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నాలుగు ఎంపీపీ స్థానాలు, నాలుగు జెడ్పీటీసీ స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. దీంతో 74 పంచాయతీ, 56 ఎంపీటీసీ సెగ్మెంట్లలో వైఎస్సార్‌సీపీ గెలిచి బలం పెంచుకుంది. దీంతో క్షేత్రస్థాయిలో వైఎస్సార్ కేడర్ పెంచుకుని బలోపేతమైంది.

పోలింగ్ శాతం పెంపుతో ఎవరికి మేలు?

ఈ పర్యాయం సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో పోలింగ్ శాతం బాగా పెరిగింది. 2019 ఎన్నికల్లో 85 శాతం పోలింగ్ కాగా 2024 ఎన్నికల్లో 90 శాతం నమోదైంది. 5 శాతం పెరిగింది. ఈసారి ఓటింగ్‌కు మహిళలు పోటెత్తారు. నియోజకవర్గంలో 1,13,247 మంది ఓటర్లకుగాను 1,01,306 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నాడు. అలాగే 101306 మంది పురుషులు ఓట్లు వేశారు. వీరికంటే 302 మంది మహిళలు అధికంగా ఓట్లు వేశారు. దీనిని బట్టి చూస్తే మహిళలే గెలుపెవరిదో నిర్దేశించే కర్తలను స్పష్టమైంది. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన మహిళలే వైఎస్సార్ సీపీని ఆశీర్వదించారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం అసెంబ్లీ స్థానాన్ని వైఎస్సార్ సీపీ గెలుపు పై ధీమా ఉంది. ఈ సారి పోలింగ్ సరళి , మహిళల ఓటింగ్ పట్ల వైఎస్సార్ సీపీ పార్టీ వర్గాలు సానుకూలంగా ఉన్నారు. ఈ ఐదేళ్లపాటు ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ నియోజకవర్గంలో గడప గడపకూ తిరిగి అందరికీ సుపరిచితులయ్యారు. ఎమ్మెల్సీగా నియోజకవర్గం అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేసి ప్రజల అభిమానం చూరగొన్నారు. ఇక సతీమణి దుర్గా పద్మిని సైతం ప్రతి ఇంటి తలుపునూ తట్టి పలకరించారు. నియోజకవర్గంలో 79వేల కుటుంబాలను ఆమె కలిశారు. వారితో మమేకయ్యారు. అదే చంద్రబాబుగానీ, ఆయన కుటుంబ సభ్యులు గానీ ఇన్నేళ్ల చరిత్రలో ఏరోజూ నియోజకవర్గ ప్రజలను భరత్ దంపతుల తరహాలో కలిసిన దాఖలాలు లేవు. ఇదే వారికి ప్లస్ పాయింట్ అయ్యిందని, ప్రజలు కూడా వారి గురించి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మేలు గురించి ఆలోచించారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఆ అభిమానమే పోలింగ్ రోజున మహిళలు పెద్ద సంఖ్యలో ఓటింగ్‌కు వచ్చారని, ఇదంతా వైఎస్సార్ సీపీకి కలిసొచ్చిన అంశాలని ధీమాగా చెబుతున్నాయి. ఇక, టీడీపీ శ్రేణులు మాత్రం చంద్రబాబును కుప్పం ఎన్నటికీ ఆయన్ను విస్మరించదని, ప్రత్యర్థితో నిమిత్తం లేకుండా ఆయన్ను గెలిపిస్తుందని టీడీపీ నేతలు ఆశావాదంతో ఉంటున్నారు.

నేటి నుంచి బీసీజీ వ్యాక్సినేషన్

చిత్తూరు రూరల్(కాణిపాకం): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తెలిపారు. ఉదయం 8 గంటలకు నగరంలోని సత్యనారాయణపురంలో వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తామన్నారు. వ్యాక్సినేషన్‌ను క్షయ బాధితులు, బాధితుల కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 75,783 మంది స్వామివారిని దర్శించుకోగా 35,665 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.08 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం పూర్తవుతోంది.

పెంచలకోన ఆలయానికి భారీ ఆదాయం

రాపూరు: పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోని హుండీల ద్వారా ఈసారి భారీ ఆదాయం వచ్చిందని డీసీ విజయ సాగర్ తెలిపారు. శ్రీవారి ఆలయ మండపంలో బుధవారం హుండీలోని కానుకలను లెక్కించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 54 రోజులకు గాను లెక్కించిన శ్రీవారి హుండీల ద్వారా రూ.53.3 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. బంగారం 230 గ్రాములు, వెండి 2.9 కేజీలు వచ్చినట్లు చెప్పారు. విదేశాలకు చెందిన కరెన్సీ నోట్లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ ఏసీ వెంకటేశ్వర్లు, జిల్లా దేవదాయశాఖ సిబ్బంది, బ్యాంకు, పోలీస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమానికి జైకొట్టిన ఓటర్లు

- మహిళా ఓటింగ్ పెరగడమే నిదర్శనం
- ఓటర్లను బెదిరించడం థామస్‌కు తగదు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



చంద్రశేఖర్‌రాజును పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలనకు ఓటర్లు జై కొట్టారని, ప్రత్యేకించి మహిళా ఓటింగ్ పెరగడమే దీనికి నిదర్శనమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పేర్కొన్నారు. బుధవారం ఆయన రాచపాల్యంలో అనారోగ్యంతో ఉన్న చంద్రశేఖర్ రాజుని తమ పార్టీ కార్యకర్తలతో కలసి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ పర్యాయం ఎన్నికల్లో పోలింగ్‌కు మహిళ ఓటర్లు సునామీలా తరలివచ్చారని చెప్పారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం చేయాలని వారు బలంగా ఆకాంక్షించారని పేర్కొన్నారు. చంద్రశేఖర్ రాజు టీడీపీ జెండాను మోశారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఆయన వైఎస్సార్ సీపీలో చేరి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం బైక్‌లో ప్రచారం చేశారని చెప్పారు. ఆయన కృషిని తానెప్పటికీ మరవనని తెలిపారు. ఇక, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ ఓటర్లను బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడం ఎంతమాత్రమూ సరికాదని మండిపడ్డారు. ఎన్నికలకు థామస్ మూడు వందల మందిని రౌడీలను తీసుకొచ్చి ప్రతి గ్రామంలో అల్లకల్లోలం సృష్టించాడని, ఓటర్లను ప్రలోభాలకు గురిశాడని, రూ. 500 టోకెన్, యువకులకు మద్యం ఇచ్చి గ్రామాల్లో గొడవలు రేపాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన రాజకీయ చరిత్రలో ఇలాంటి నీజ రాజకీయం ఎన్నడూ చూడలేదన్నారు. ఓటర్లకు ఇవ్వడానికి థామస్ టిప్పర్‌లో మద్యం సీసాలను తీసుకొచ్చాడని, దానిని సీజ్ చేశారని చెప్పారు. అతడు దౌర్జన్యం చేస్తున్నాడని, ఓటర్లను బెదిరిస్తున్నాడని ఎస్పీలు, డీఎస్పీలకు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, మండల కన్వీనర్ తులసి యాదవ్, మండల రైతు భరోసా చైర్మన్ పోలయ్య, సర్పంచ్ గాలి మహేష్ బాబు, అయ్యప్ప, సుందరరాజు, షణ్ముగరెడ్డి, ఆనందన్, ప్రకాష్, చంద్రకుమార్, శరవణన్, సుబ్ర మణ్యం , సుబ్రమణ్యరెడ్డి, గోపాల్, షణ్ముగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

- కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు జిల్లాలో 144 సెక్షన్



ఈవీఎంలు భద్రపరచిన గదిని పరిశీలిస్తున్న చిత్తూరు ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లను చిత్తూరు ఎస్పీ మణికంఠ బుధవారం తనిఖీ చేశారు. చిత్తూరు సమీపంలోని ఎస్వీ-సెట్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఈవీఎంల ప్రాంగణాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ మూడంచెల భద్రత వ్యవస్థ కల్పించామని, ఎక్కడా కూడా లోటుపాట్లకు తావివ్వరాదని ఆదేశించారు. 24 గంటలు విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నపాటి ఘటనలు మినహా, పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించిన పోలీసు అధికారులను, కేంద్ర సాయుధ బలగాలను ఎస్పీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో కౌంటింగ్ అయ్యేంత వరకు శాంతిభద్రతలను పర్యవేక్షించాలన్నారు. ఇక జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు సెక్షన్ 144 అమలులో ఉంటుందన్నారు. ఎక్కడగానీ గుంపులుగా ఉండకూడదని, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ ఆరీఫుల్లా, డీఎస్పీలు రాజగోపాల్‌రెడ్డి, మహబూబ్‌బాషా, సీఐలు సుదర్శన్ ప్రసాద్, ఆర్ఐ నీలకంఠేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

అయ్యో! దేవుడా..


- మొగిలిఘాట్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం
- వరిగడ్డి ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ
- ఇద్దరు మృతి..ఐదుగురికి తీవ్రగాయాలు
- పశుగ్రాసం కోసం వెళ్లి వస్తూ మృత్యుఒడిలోకి..
- ఇంటికి చేరేలోపు వెంటాడిన మృత్యువు
- ముగ్గురి పరిస్థితి విషమం




ప్రమాదంలో మృతిచెందిన వారు

బంగారుపాళ్యం: వారంతా రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి.. పాడిపై ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నారు. తమకు బతుకునిస్తున్న పశువులకు గ్రాసం కోసం పలమనేరు వెళ్లి, వరిగడ్డి లోడుతో తిరిగి వస్తుండగా ఇంటికి చేరేలోపు ఘోర రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు మృత్యు ఒడికి చేరుకున్నారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈఘటన బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని కీరమంద గ్రామానికి చెందిన నాగభూషణం(29), రాజయ్య(42), జయచంద్ర(49), రాజా(35), వేణు(60), బాబు(45) పలమనేరుకు పశుగ్రాసం కోసం ట్రాక్టర్‌లో వెళ్లారు. అక్కడ నుంచి వరిలోడుతో తిరుగు ప్రయాణమయ్యారు. మొగిలి ఘాట్ వద్ద ట్రాక్టర్ వెనుక వస్తున్న ఓ కట్టెల లారీ బ్రేక్ డౌన్ అయింది. దీంతో ఆ లారీ డివైడర్‌ను ఢీకొని.. ట్రాక్టర్‌పై దూసుకెళ్లింది. ఆపై ట్రాక్టర్‌తో పాటు లారీ కూడా బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న ఆరుగురు చెల్లాచెదురుగా పడిపోయారు. కట్టెల లారీ వెనుక వస్తున్న అట్టల లారీ కూడా బోల్తా పడి అదుపుతప్పిన లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో భద్రాచలంకు చెందిన లారీ డ్రైవర్ రామారావుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను బంగారుపాళ్యం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రాజా మృతి చెందాడు. అలాగే పలమనేరు ఆస్పత్రిలో వేణు కూడా ప్రాణాలు కోల్పోయాడు. గాయపడ్డ వారిలో బాబు పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే నాగభూషణం, జయచంద్ర, రాజయ్య, లారీ డ్రైవర్ రామారావును చికిత్స నిమిత్తం చిత్తూరు జిల్లా ఆస్పత్రికి తరలించగా జయచంద్ర, నాగభూషణం పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి తిరుపతికి రెఫర్ చేశారు. అయితే ట్రాక్టర్..లారీ ఢీకొనే సమయంలో ఓ ద్విచక్రవాహనం ట్రాక్టర్‌ను క్రాస్ చేసినట్లు తెలుస్తోంది. ఇంతకీ ఆవాహనదారుడి ఆచూకీ తెలియడం లేదు. దీంతో గ్రామంలో విషాద ఛాయాలు అలుముకున్నాయి. ఈ రోడ్డు ప్రమాదానికి మితిమీరిన వేగమే కారణమని స్థానికులు చెబుతున్నారు. డీజిల్ ఆదా చేసేందుకు న్యూట్రల్‌లో నడపడం వల్ల బ్రేక్ డౌన్ కావడంతో పాటు ప్రమాదానికి కారణమని పలువురు అంటున్నారు. ఇక సమాచారం అందుతున్న డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు.






ప్రమాద ఘటనలో బోల్తాపడ్డ వాహనాలు

ఓటుకు డుమ్మా!

- ఏడు నియోజకవర్గాల్లో 2,01,903 మంది ఓటుకు దూరం
- ఓటు వేయని పురుష ఓటర్లు 95,700 మంది



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును పలువురు సద్వినియోగం చేసుకోలేదు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటుకు డుమ్మా కొట్టారు. గత ఎన్నికల కంటే జిల్లాలో పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైనప్పటికీ ఈసారి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,01,903 మంది ఓటర్లు ఓటు వేయలేదు. వాస్తవానికి ఓటు హక్కు ప్రాధాన్యతపై జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఓటు విలువను తెలియజేసింది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యంత్రాంగం ఓటర్లకు అవగాహన కల్పించింది. అయినప్పటికీ కొందరు ఓటింగ్‌కు రాలేదు. ఎగువ మధ్య తరగతి, ఉన్నత తరగతికి చెందిన వారు వీరిలో అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది.

చిత్తూరులోనే అత్యధికం

చిత్తూరు నియోజకవర్గంలో అత్యధికంగా 38,062 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు. జిల్లా కేంద్రంలోని చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లో ఓటు హక్కు వినియోగించుకోకుండా అలసత్వం చూపారు. అలాగే పుంగనూరు, నగరి, జీడీ నెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోనూ వేల సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకోలేదు.

ఓటు వేయని మహిళా ఓటర్లు 1,06,163 మంది

జిల్లా వ్యాప్తంగా ఈ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏడు నియోజకవర్గాల్లో ఓటు హక్కుకు నమోదు చేసుకున్న వారిలో మహిళలే అత్యధికంగా ఉన్నారు. మొత్తం 7,93,682 మంది ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోగా ఎన్నికల్లో 6,87,519 మంది మాత్రమే ఓటు వేశారు. 1,06,163 మంది ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. అలాగే పురుషులు 7,70,154 మంది ఓటు హక్కును పొందారు. ఇందులో 6,74,454 మంది ఓటు వేయగా 95,700 మంది ఓటు వేయలేకపోయారు. ఇతరుల్లో 75 మందికి గాను 35 మంది ఓటు వేయగా 40 ఓటు హక్కును వినియోగించుకోలేదు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటు వేయని వారు

నియోజకవర్గం	ఓటు వేయనివారు
పుంగనూరు	31,952
నగరి	26,175
జీడీ నెల్లూరు	23,170
చిత్తూరు	38,062
పూతలపట్టు	27,269
పలమనేరు	32,420
కుప్పం	22,855
మొత్తం	2,01,903

క్లుప్తంగా

వ్యక్తి దారుణ హత్య

కుప్పం: ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం స్థానిక బైపాస్ రోడ్డులోని కృష్ణాగిరి సర్కిల్ వద్ద వెలుగులోకి వచ్చింది. పోలీసు కథనం..మండలంలోని పెద్దబంగారునత్తంకు చెందిన మణి అలియాస్ కుట్టప్ప (45) బేల్దారి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి కుప్పం వచ్చాడు. మద్యానికి బానిసైన అతను మద్యం సేవించి మత్తులో పట్టణంలో ఎక్కడపడితే అక్కడ తిరుగుతు ప్రజలకు కన్పించాడు. గత నెలలో కుమార్తెకు వివాహం చేయడంలో అప్పటి నుంచి పనులకు వెళ్లకుండా మద్యం సేవించి తిరిగేవాడు. ఈ నేపథ్యంలో కుప్పంకు వచ్చిన అతడు కృష్ణగిరి సర్కిల్‌లో రోడ్లు భవనాల శాఖ నూతనంగా నిర్మిస్తున్న కార్యాలయ భవనం వద్ద మంగళవారం రాత్రి హత్యకు గురయ్యాడు. సంఘటన స్థలాన్ని కుప్పం డీఎస్పీ శ్రీనాథ్, సీఐ రమణ పరిశీలించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హతునికి భార్య, మరో ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సేవా లోపం.. రూ.23.14 లక్షలు రికవరీకి నివేదిక

పరిహారానికి 2,341మంది అర్హులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లాలోని 8 డివిజన్ల పరంగా ఈ ఏడాది జనవరి–మార్చి వరకు వినియోగదారులకు జరిగిన సేవాలోపానికి గాను రూ.23,14,550 మొత్తాన్ని దాదాపు వందమంది ఏఈల జీతాల నుంచి రికవరీ చేయాలని ఏపీఈఆర్సీకి ఆ శాఖ జిల్లా అధికారులు బుధవారం నివేదిక పంపారు. ఎస్‌ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) పాటించలేదని, అందుకే ఈ మొత్తాన్ని వారి జీతాల నుంచి కట్ చేయాలని నివేదించారు. ఈ నిబంధనల ప్రకారం ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, రిలీజ్ ఆఫ్ న్యూ సర్వీస్, పనుల కోసం అంచనా– అని మూడు విభాగాల పరంగా మొత్తం 2,341 ఫిర్యాదుదారులు పరిహారానికి అర్హులని వివరించారు.

తృటిలో తప్పిన ఘోర రోడ్డు ప్రమాదం


తిరుపతి- బెంగళూరు హైవేలో లారీ కిందకు దూసుకెళ్లిన కారు

తవణంపల్లె: మండలంలోని పట్నం సమీపంలో తిరుపతి–బెంగళూరు హైవేలో బుధవారం సాయంత్రం తృటిలో ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. బెంగళూరుకు వెళుతున్న కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీ వెనుక దూసుకెళ్లడంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బైపాస్ రోడ్డులో వాహనాలను మితిమీరిన వేగంతో నడపడం వల్లే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఖరీఫ్‌కు సన్నద్ధం

- అనుకూలిస్తున్న వాతావరణం, వర్షాలు
- దుక్కులకు సిద్ధమవుతున్న రైతులు
- రైతుభరోసా కేంద్రాలకు చేరిన విత్తనాలు
- ఎరువుల సరఫరాపై అధికారుల దృష్టి
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పెట్టుబడి సాయానికి మోకాలొడ్డిన ప్రతిపక్షాలు
- సాయం కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు


దుక్కులు చేస్తున్న దృశ్యం(ఫైల్)

కాణిపాకం: ఖరీఫ్‌కు రైతులు కోటి ఆశలతో సన్నద్ధమవుతున్నారు. వాతావరణం అనుకూలించడంతో సాగుకు పూనుకుంటున్నారు. అదునుకు తగ్గట్టు వర్షాలు కురుస్తుండడంతో దుక్కులు చేసేందుకు పూనుకుంటున్నారు. ముందుస్తుగానే ప్రభుత్వం సైతం విత్తనాలను రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసింది. ఎరువుల సరఫరాపై కూడా అధికారులు దృష్టి పెట్టారు. ఫలితంగా వేరుశనగ విత్తేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు జోరుగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రణాళికలు సిద్ధం

ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు 2024 ఖరీఫ్ సాగు ప్రణాళికలను రైతు భరోసా కేంద్రాల వారీగా సిద్ధం చేశారు. ఖరీఫ్ అంటే డివిజన్‌లోని రైతులకు గుర్తొచ్చే పంట వేరుశనగ. వర్షాధార పంటగా వేరశనగను అధిక విస్తీర్ణంలో సాగు చేయడం పరిపాటి. చిత్తూరు డివిజన్‌లోని 10 మండలాల్లో సుమారు 73,103 మంది రైతులు ఉండగా, 40వేల మందికిపైగా వేరుశనగ పంటను సాగు చేస్తారు. 15వేల హెక్టార్ల వరకు పంట సాగులోకి చేస్తున్నారు. దీంతో పాటు అంతరపంటగా కందులు, అలసంద, జనుములు వేసేవారు. ఈ సారి సాధారణ విస్తీర్ణం 15,833 హెక్టార్లు ఉండగా..వర్షాభావ పరిస్థితులను బట్టి సాగు విస్తీర్ణం పెరగవచ్చని అధికారులు అంచనా వేశారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది.

ఆర్బీకేలకు విత్తనాలు

వారం క్రితమే వేరుశనగ విత్తనాలను వ్యవసాయ అధికారులు ఆర్బీకేలకు సరఫరా చేశారు. డివిజన్‌కు మొత్తం 12,870 క్వింటాళ్ల విత్తనాలు కావాల్సి ఉండగా... కే–6 రకం 6,598.80 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయి. వీటిని ఆర్బీకేల్లో భద్రపరచారు. మరో వారం రోజుల్లో విత్తనాలను పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. అలాగే విత్తన రేటును ప్రకటించనున్నారు. బయోమెట్రిక్, ఓటీపీ ఆధారంగా కాయలను పంపిణీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో జీలుగలు, జనుములు రానున్నాయి. దీంతో పాటు కావాల్సినన్ని ఎరువులు అందుబాటులో ఉంచారు.

కురుస్తున్న వర్షాలు

గత వారం రోజులుగా ఉరుములు, మెరుపులతో కూడి వర్షాలు కురుస్తున్నాయి. గాలీవాన బీభత్సం సృష్టిస్తోంది. పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో మోస్తరు వర్షం పడింది. చిత్తూరు మండలంలో 31.8 మి.మీ, గుడిపాలలో 13.04 మి.మీ, యాదమరి 57.0 మి.మీ, బంగారుపాళ్యం 72.06 మి.మీ, తవణంపల్లె 93.06 మి.మీ, ఐరాల 56.04మి.మీ, పూతలపట్టు 60.08 మి.మీ, పెనుమూరు 13.06 మి.మీ, వెదురుకుప్పం 28.04 మి.మీ వర్షం కురిసింది. ఈ వర్షం వేసవి దుక్కులకు అనుకూలంగా మారింది. దీంతో ముందుగానే రైతులు దుక్కులు దున్నడం, ముళ్లకంపల తొలగింపు..ఇత్యాది పనుల్లో నిమగ్నమయ్యారు.

పెట్టుబడి సాయం

పంటల సాగు చేసే సమయంలో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఖరీఫ్ సాగు ముందే ప్రతి ఏటా అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా కింద రూ.5,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని జమ చేస్తోంది. అయితే ఈసారి ఎన్నికల నేపథ్యంలో వీటిని జమ చేస్తారా, లేదా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. బటన్ నొక్కి పథకాల సొమ్ములను జమ కాకుండా ఆపాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు.. ఇప్పుడైనా రైతు భరోసా నిధులు విడుదల చేయనిస్తారా, లేదా? అన్నది వేచి చూడాల్సి వస్తోంది. 2024–25 సంవత్సరానికి గాను రైతు భరోసా నిధుల కోసం డివిజన్ వ్యాప్తంగా 73 వేల మంది రైతులు ఎదురుచూస్తున్నారు.


'వైఎస్సార్ చేయూత'ను అడ్డుకోవడం తగదు



రైతు భరోసా కేంద్రాలతో ప్రభుత్వం అందిస్తున్న సేవలు మాకెంతో ఉపయోగపడుతున్నాయి. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు శ్రమ లేకుండా పొందగలుతున్నాం. రైతు భరోసా పేరిట ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని ఎన్నికల సాకుతో ప్రతిపక్షాలు అందనీయకుండా చేయడం సరికాదు. ఎన్నికల కోడ్ ఎత్తివేసే వరకూ అందదేమో!? సరైన టైమ్‌కు ఇది అందితేనే మాకు ఖరీఫ్‌లో పంటల సాగుకు మేలు. లేదంటే ఇబ్బందులు పడాలి.

–పెద్దబ్బనాయుడు, జీడీనెల్లూరు

చంద్రబాబుకు కడుపు మంట ఎందుకో?



గత నాలుగేళ్లగా ఖరీఫ్ మొదలైతే మే నెలాఖరులో పెట్టుబడి సాయం మా ఖాతాలో పడేది. దీంతో వేసవి దుక్కులు చేసుకుని వేరుశనగ, ఇతర పంటలు వేసుకునేవాళ్లం. ఈసారి వర్షాలు మొదలయ్యాయి. విత్తన కాయలు కూడా రైతు భరోసా కేంద్రాలకు వచ్చాయి. జగన్‌కు ఓట్లేస్తామోనని ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు చేసి ఎన్నికల సాకుతో పెట్టుబడి సాయాన్ని అడ్డుకుంది. ఈ ప్రభావం ఖరీఫ్ సీజన్‌పై పడుతుంది. చంద్రబాబుకు రైతులంటే ఎప్పుడూ కడుపు మంటే ఎందుకో మరి!

–సుబ్బానాయుడు, శ్రీరంగరాజపురం

లారీ ఢీకొని మోటార్ సైక్లిస్టులు మృతి


సంఘటన స్థలంలోనే మృతి చెందిన యువకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన బుధవారం చిత్తూరు మండలంలో చోటుచేసుకుంది. బీఎన్‌ఆర్‌పేట పోలీసుల కథనం.. గంగాధరనెల్లూరు మండలం ఆవలకొండకు చెందిన అజర్‌ఆలీ(20), గజయాబాషా(19) చికెన్ షాపుల్లో పని చేస్తున్నారు. వీరిద్దరూ చికెన్ దుకాణానికి సెలవు కావడంతో ద్విచక్రవాహనం మీదుగా చిత్తూరు నుంచి బీఎన్‌ఆర్‌పేట మీదుగా ఆవలకొండకు వెళ్తుండగా బంగారెడ్డిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ తెలిపారు.

రఘుపతినాయుడు కుటుంబానికి అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి
- దశదిన కర్మలకు హాజరైన ప్రజాప్రతినిధులు


రఘుపతినాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: తెలుగుదేశం పార్టీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడి మృత్యువుతో ఐదురోజులు పోరాడి కన్నుమూసిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయకొండక్రాస్‌కు చెందిన రఘుపతినాయుడు కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం బోయకొండ క్రాసులో నిర్వహించిన దశదిన కర్మక్రియలకు ఆయనతోపాటు జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, పాల ఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లడ్డు రమణ, పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు హాజరయ్యారు. రఘుపతినాయుడు మృతితో పార్టీ మంచి నేతను కోల్పోయిందని, ఆయన లేని లోటును పూడ్చలేమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారం ఎప్పటికీ ఉంటుందని, అండదండలు ఉంటాయన్నారు. అనంతరం రఘుపతినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, నేతలు మల్లికార్జునరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రమేష్‌బాబు, చిన్నప్ప, మునికృష్ణమనాయుడు, బాబురెడ్డి, గిరిబాబు, రాజశేఖర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ కార్యాలయంలో మరమ్మతులు

- తన సొంత సొమ్ము వినియోగిస్తానన్న ఆలయ ఈఓ


ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె: తన సొమ్ముతో బోయకొండ గంగమ్మ ఆలయ కార్యాలయంలో మరమ్మతులు చేయిస్తానని ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బోయకొండ కార్యాలయంలో మంగళవారం గుర్తించిన అగ్ని ప్రమాదం ప్రకృతి వైపరీత్యాల కారణంగా చోటు చేసుకుందని పేర్కొన్నారు. ఈ ఘటన తననెంతో బాధించిందని చెప్పారు. ప్రమాదంలో కంప్యూటర్లు, ఎలక్ట్రికల్ సామగ్రి, సీసీ కెమెరాలు, ఎయిర్ కూలర్ పరికరాలు, వివిధ సామగ్రి దెబ్బతిన సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు వివరించారు. తన సొంత సొమ్ముతో వీటిని పది రోజుల్లో మరమ్మతులు చేయించి కార్యాలయాన్ని పూర్వస్థితికి తెస్తామన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ


ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అనిల్‌నాయక్

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం రాష్ట లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ నాయక్ తనిఖీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుంచి నిర్వహించనున్న అడల్ట్ బీసీజీ వాక్సేషన్ క్యాంపునకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అన్ని విధాలుగా వైద్య సేవలను అందించాలన్నారు. వైద్యాధికారి ప్రవీణ, సీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి, నూర్జహాన్, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వేషాల వేడుక

భక్తుల కొంగుబంగారంగా, సాక్షాత్తు కలియుగ వైకుంఠుడైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి స్వయాన చెల్లెలు, శక్తి స్వరూపిణి అయిన శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. తొలి రోజు బైరాగి వేషధారులతో పట్టణంలో సందడి నెలకొంది. ఐదు రోజుల పాటు భక్తులు ఒక్కో రోజు ఒక్కో వేషధారణలో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. గంగజాతరను ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రస్థాయి పండుగగా గుర్తించిన నేపథ్యంలో మరింత శోభాయమానంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

- ప్రారంభమైన తిరుపతి గంగజాతర
- తొలిరోజు బైరాగి వేషంతో భక్తుల సందడి



తిరుపతి కల్చరల్ : భక్తుల కొంగుబంగారమైన తాతయ్యగుంట గంగమ్మ జాతర తొలి రోజు బుధవారం భక్తుల బైరాగి వేషాలతో హోరెత్తింది. చిన్న, పెద్దా అనే తేడా లేకుండా శరీరమంతా విభూది రాసుకుని నల్లటి బొట్లు పెట్టుకుని మెడ, కాళ్ల చేతులకు రేల కాయల గజ్జలు కట్టుకుని నడుముకు వేపాకు కట్టి చేతుల్లో వేపాకు కొమ్మలను పట్టుకుని నగరంలో కేరింతలు కొడుతూ విహరించారు. అనంతరం వేషాలమ్మ, తాళ్లపాక పెద్ద గంగమ్మలను దర్శించుకుని తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకుని ప్రదక్షిణ చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. కొందరు వెయ్యి కళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకుని ఆలయ ప్రదక్షిణ చేశారు. బుధవారం ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలో కొలువుతీర్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతరలో నేడు బండవేషం..

తిరుపతి గంగజాతర ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం నాడు భక్తులు బండవేషంలో అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. జాత ర సంప్రదాయం ప్రకారం కైకాల వారు బండోళ్ల చిన్నది(స్త్రీవేషం), చాకలివారు బండోడు(పురుష వేషం) వేస్తారు. అలాగే స్థానికుల పిల్లలు, పెద్దలు బండవేషాలు వేస్తారు. ఎర్రటి కుంకుమ ఒళ్లంతా పూసుకుని బొట్లు పెట్టుకుని బొరుగుల దండలు, బండపూల దండలను మెడకు, చేతికి కట్టుకుని రోకలి, కర్ర చేతపట్టి లయబద్ధంగా శబ్దం చేస్తూ బూతులు తిడుతూ పురవీధుల్లో విహరిస్తారు.





విద్యార్థిని చితకబాదిన సహచరులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో అరవింద్ (18) అనే యువకుపై సహచర విద్యార్థులు దాడికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు మండలం ఎస్ఆర్.పేటకు చెందిన అరవింద్, చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో కోర్సు పూర్తి చేసి ఇటీవల బయటకు వచ్చాడు. ఇతనితో పాటు చదువుకున్న విద్యార్థులు కొందరు బుధవారం ఐటీఐ ప్రాంగణం వద్ద ఉన్నారు. ఊరి వద్ద అరవింద్‌తో పాటు చదువుకున్న విద్యార్థికి చిన్నపాటి గొడవలు జరిగాయి. దీన్ని మనసులో ఉంచుకుని పది మంది వరకు విద్యార్థులు తనపై దాడి చేశారని బాధితుడు తెలిపారు. ఇతనికి రక్తగాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు

చిత్తూరు కార్పొరేషన్: వేసవి కాలంలో వ్యవసాయ లోడ్ పెరగడంతో దెబ్బతింటున్న ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య పెరుగుతోందని ట్రాన్స్‌కో ఎస్పీఎం డీఈ ఆనంద్ తెలిపారు. ఇటీవల గాలీవానకు సైతం ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని, దీంతో చిత్తూరు, పలమనేరు చుట్టుపక్కల ప్రాంతాల రైతులు ఇక్కడికి రాకుండా అక్కడికే వెళ్లి సిబ్బంది మరమ్మతులు చేశారన్నారు. పూతలపట్టు, పెనుమూరు, గంగవరం ప్రాంతాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో బాగు చేశామన్నారు. గత నెలలో 240 ట్రాన్స్‌ఫార్మర్లు, ఈనెలలో ఇప్పటి వరకు 180 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయని వివరించారు.

శతాధిక వృద్ధురాలు మృతి


ఆర్ వెంకటమ్మ (ఫైల్)

విజయపురం : మండల కేంద్రం విజయపురానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఆర్.వెంకటమ్మ (111) బుధవారం మృతి చెందారు. ఆమె ఈ నెల 13వ తేదీ చివరిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆమెకు ఒక కుమార్తె ఉంది. ఆమె వయసు 85 సంవత్సరాలు కావడం విశేషం.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

SINGLE SITTING
SINGLE SITTING : 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., M.B.A., BBA, BCA, B.Tech., D.Ed., B.Ed., Agriculture, Pharmacy, Nursing, (For Drop outs /Back Logs) from recognised Universities. Exams in May/June Cont: ✆ : 73383 76874

Real Estate

TOLET
తిరుపతి తిరుచానూరు రోడ్డు RBL బ్యాంక్ పక్క రోడ్‌లో మోటార్ వర్కర్స్ కాలనీ నందు 2 BHK ఇండిపెండెంట్ ఇల్లు కమర్షియల్ కొరకు అద్దెకి ఇవ్వబడును. 9491310655.

Wanted
తిరుపతి, ఎం.ఆర్.పల్లి పోలీస్‌స్టేషన్ ప్రక్కన ఉన్న అత్తూరు ఫ్యామిలీ దాబా నందు పనిచేయుటకు అనుభవం గల క్యాషియర్, Stewards, Accountant, మైంటెనెన్స్ సూపర్‌వైజర్ కావలెను. ✆ 8977051210

నెల్లూరు పరిసర ప్రాంతాలలోని కంపెనీలలో సెక్యూరిటీ గార్డ్స్, ఆఫీసర్స్, మేనేజర్స్‌గా పని చేయుటకు అనుభవం కలిగిన వారు కావలెను. జీతం: 12000–20000. సెల్: 98417 40000.

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ. 18K. ఫోన్: 9640258899, 9640468899

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 95026 15217

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9848888208, 9573833520.

షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ ఆఫీస్ అసిస్టెంట్స్, నర్సులు, లేడీ కేర్ టేకర్స్, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036881, 8246585901

కస్తూర్బాకేర్స్ VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకో వడానికి స్త్రీలు/పు.ఆయా,నర్సులు, వంట చేయు వారు,RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీరూం+ భోజనం. HYD. 9014885406

Wanted Bank Field Verification Executives : Tirupati, Naidupet, Sullurupet, Tada, Gudur.Field Exp.:Courier,Zomato, Swiggy Services.Cont:7288803402,7981801911

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

